## క్లుప్తంగా

### బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా నాగిరెడ్డి



మిర్యాలగూడ టౌన్‌ : భారతీయ జనతా పార్టీ(బీజేపీ) మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా తుంగపాడు గ్రామానికి చెందిన సజ్జల నాగిరెడ్డిని నియమిస్తూ ఆపార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్‌ నాగం వర్షిత్‌రెడ్డి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసి పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియమకానికి అన్నీ విధాలుగా సహకరించిన రాష్ట్ర పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జి. కిషన్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, పార్లమెంటు కన్వీనర్‌ ప్రసాద్‌, నియోజకవర్గ ప్రభారీ లచ్చిరెడ్డి, మహిళ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరిత, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు హన్మంతరెడ్డి, విద్యాసాగర్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్‌

గుర్రంపోడు : గ్రామీణ యువత ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ ఐ బి. శివప్రసాద్‌ అన్నారు. శనివారం మండలంలోని తానేదార్‌పల్లిలో జిల్లా యువజన స్పోర్ట్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఉచిత వేసవి ఫుట్‌బాల్‌ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు యువకుల్లో శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. పరిసర గ్రామాల యువకులు, విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళలో క్రీడల్లో పాల్గొనాలన్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రంగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ఫుట్‌బాల్‌ కోచ్‌ మద్ది కరుణాకర్‌, మద్ది యాదయ్య, నర్సింహ్మా, కొండల్‌, గిరి , గణేష్‌, మహేష్‌ పాల్గొన్నారు.

### రేపు సీపీఐ జనరల్‌ బాడీ సమావేశం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

దేవరకొండ : సీపీఐ బలపరిచిన కాంగ్రెస్‌ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం దేవరకొండ పట్టణంలోని శివసాయి ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం సీపీఐ పల్లా పర్వతరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ.మైనొద్దీన్‌, జూలూరి వెంకట్రాములు, పగిళ్ల బుచ్చయ్య, తోటపల్లి నగేష్‌, వలమల్ల ఆంజనేయులు, కందుకూరి శ్రీను, లింగంపల్లి వెంకటయ్య, జూలూరి జ్యోతిబసు పాల్గొన్నారు.

### పని దినాలతో పాటు కూలి పెంచాలి

పెద్దఅడిశర్లపల్లి : జాతీయ ఉపాధి హామీ కూలీలకు పని దినాలతో పాటు కూలి పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కంబాలపల్లి ఆనంద్‌ డిమాండ్‌ చేశారు.శనివారం ఉమ్మడి పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీల ప్రదేశంలో నల్లగొండ పార్లమెంట్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మద్దతుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్షాల మద్దతుతో దేశంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెరికే విజయ్‌కుమార్‌, చంద్రూనాయక్‌, సత్యనారాయణ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లకు ఓటు వేస్తే మురిగినట్లే



కార్నర్‌ మీటింగ్‌లో పాల్గొన్న నేతలు

మిర్యాలగూడ టౌన్‌ : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలకు ఓటు వేస్తే మురిగినట్లేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డిలు అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలో బీజేపీ పట్టణ అధ్యక్షులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్నర్‌ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ నేత బంటు సైదులు, బీజేపీ ముత్తిరెడ్డికుంట నాయకులు నక్క రవిబాబు, ఎం. వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

# యథేచ్ఛగా చెరువు మట్టి దందా

- జేసీబీలతో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు, ఇటుక బట్టీలకు తరలింపు
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



కొండ్రపోల్‌ చెరువు నుంచి మట్టి తరలిస్తున్న టిప్పర్‌



దంపు చేసిన చెరువు మట్టి

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అని తేడా లేకుండా స్థానిక నాయకులు ఇష్టానుసారంగా చెరువు మట్టిని తవ్వి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువుల్లో నీరు అడుగంటిపోయి ఎండిపోయాయి. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు చెరువుల్లో జేసీబీల సాయంతో మట్టిని ఇష్టానుసారంగా తవ్వి రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లలో, రోడ్ల నిర్మాణంలో, ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి, ఇటుక బట్టీల వ్యాపారులకు మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతా జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెరువుల్లో పూడిక మట్టిని రైతులు తమ పొలాలకు తరలించుకోవాలంటే సరైన పత్రాలను సమర్పించి ఈఈల పరిధిలోనే అనుమతి పొందాలి. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తే సంబంధిత రైతులపై చర్యలు ఉంటాయనే నిబంధనలు ఉన్నాయి. కాని అక్రమార్కులతో చేతులు కలిపిన పలువురు అధికారులు చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతి ఇస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**దామరచర్లలోనూ..**

దామరచర్ల శివారులోని బైరం చెరువు, కొండ్రపోల్‌ చెరువులో ఉపాధిహామీ కూలీలు పూడిక తీత పనులు చేపడుతున్నారు. ఆ మట్టిని కూలీలు ఒకవైపు కుప్పలుగా పోస్తున్నారు. అయితే ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమార్కులు రాత్రికిరాత్రే ఆ మట్టిని పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మరికొందరు రైతుల పేరిట అనుమతులు తీసుకోని చెరువులో మట్టిని జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఇలా ఒక్కో ట్రక్కుకు సుమారు రూ.1000 నుంచి రూ.3000 వరకు అమ్ముకుంటూ లక్షలాది రూపాయలను గడిస్తున్నారు. స్థానిక నాయకులు అధికారుల అండదండలతోనే ఈ మట్టిదందా సాగిస్తున్నట్లు అనుమానులు లేకపోలేదు. మట్టిదందా కొనసాగుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. సంబంధిత శాఖాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం వల్లనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ చెరువు మట్టి దందాను అడ్డుకోని కేవలం రైతుల పంట పొలాలకు అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**అక్రమంగా తరలిస్తే చర్యలు**

> అనుమతులు లేకుండా చెరువు మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మట్టి తరలింపు కోసం రైతులకు మాత్రమే అనుమతి ఉంది. ఉపాధిహామీ పనుల నిమిత్తం చేపడుతున్న తవ్వకాల్లో వచ్చిన మట్టిని రైతులకు మాత్రమే తరలించాలి. ఇటుకబట్టీలు, ఓపెన్‌ ప్లాట్లకు తరలిస్తే చర్యలు తీసుకుంటాం.
>
> – జనార్దన్‌, డీఈ

## భూమికి హక్కులు కల్పించాలని ధర్నా



తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కమలమ్మ కుటుంబీకులు

మాడుగులపల్లి : మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన తండు కమలమ్మ కుటుంబీకులు శనివారం తహసీల్దార్‌ కార్యాలయంలో ధర్నా చేపట్టారు. 101 సర్వే నంబర్‌లో కొంత భూమి తమదే అయినా హక్కులు కల్పించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2023లోనే తాము అర్జీ పెట్టుకున్నా ఇప్పటి వరకూ స్పందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్‌ పద్మ 101 సర్వే నంబర్‌లో పట్టాదారుల వివరాలను పూర్తిగా సమీక్షించాల్సి ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంట్‌ ఎన్నికలు పూర్తికాగానే సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పడంతో నిరసన విరమించారు.

## ఆర్థిక సాయం అందజేత

పెద్దవూర : మండల కేంద్రానికి చెందిన కిలారి చెన్నకేశవులు అనారోగ్యంతో పది రోజుల క్రితం హైదరాబాద్‌ ఆస్పత్రిలో చేరారు. ఆయనకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్న మెదడులో రక్తం గడ్డకట్టిందని తక్షణం ఆపరేషన్‌ చేయాలని, ఆపరేషన్‌ చేయడానికి హైదరాబాద్‌ సుమారు రూ.10లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన చెన్నకేశవులు కారు డ్రైవర్‌గా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్‌ హ్యాండ్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని రిహాబిలిటేషన్‌ కేంద్రానికి వెళ్లి చెన్నకేశవులు భార్యకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో అన్వేష్‌, నరేష్‌, మణిదీప్‌, పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన ఆలంపల్లి మల్లయ్య శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో త్రిపురారం మాజీ సర్పంచ్‌ అనుముల శ్రీనివాస్‌ రెడ్డి మృతుడు ఆలంపల్లి మల్లయ్య ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులుకు ఆర్థికసాయం అందజేశారు.

చందంపేట : మండల కేంద్రానికి చెందిన కాటిపాక శ్రీను–అంజలి దంపతుల ఎనిమిది నెలల చిన్నారికి ఊపిరితిత్తులు, గుండె జబ్బుతో హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆ చిన్నారికి హెల్పింగ్‌ హ్యాండ్స్‌ రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. హెల్పింగ్‌ హ్యాండ్స్‌ పోలేపల్లి ఆధ్వర్యంలో మరో రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో అన్వేష్‌రెడ్డి, నగేష్‌, మణిదీప్‌, శివ, భాస్కర్‌, హరీష్‌ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్‌ బ్యాలెట్‌కు అవకాశం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : తాము పోస్టల్‌ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నా ఓటు రాలేదని, 8వ తేదీ వరకు గడువు ఉన్నందున తమకు పోస్టల్‌ బ్యాలెట్‌కు అవకాశం కల్పించాలని పలువురు ఉపాధ్యాయులు ఆర్డీఓ, ఆర్‌ఓ శ్రీనివాస్‌రావును కోరారు. పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నుంచి మొదలైన పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు ప్రక్రియలో భాగంగా శనివారం స్థానిక కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటు వేసేందుకు వచ్చిన పలువురు ఉపాధ్యాయులకు ఓటు లేదని అధికారులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్డీఓ గడువులోపు పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఒకవేళ తమకు పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటు హక్కు రాకపోతే ఈనెల 13న పోలింగ్‌ బూత్‌లకు వెళ్లి ఓటు వేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదిరెడ్డి, వేణుధర్‌, ఉమాకర్‌ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఇందరి, కోటిరెడ్డిలు తెలిపారు.

### అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

మాడుగులపల్లి : రైతులు అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) శ్రవణ్‌కుమార్‌ సూచించారు. మాడుగులపల్లిలోని పీఏసీఎస్‌లో శనివారం ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యాపారులు, డీలర్లు ఎరువుల విక్రయ వివరాలను ఎప్పటికప్పుడు పాయింట్‌ ఆఫ్‌ స్కేల్‌ (పీఓఎస్‌)లో నమోదు చేయాలని సూచించారు. వచ్చే వానాకాలం సాగుకు సరిపడా కాంప్లెక్స్‌ ఎరువులు, యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట ఏఓ సైదానాయక్‌, వేములపల్లి ఏఈఓ నితిన్‌, పీఏసీఎస్‌ కేంద్రం సిబ్బంది ఉన్నారు.



మాడుగులపల్లి పీఏసీఎస్‌ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్‌

## ఇంటి వద్దే ఓటు వేసిన వృద్ధులు, వికలాంగులు



పెద్దవూర : వికలాంగురాలితో ఓటు వేయిస్తున్న అధికారులు



త్రిపురారం : ఇంటి వద్ద ఓటు వేస్తున్న వికలాంగురాలు

పెద్దవూర : మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్‌ ఎస్‌.సరోజ, ఎంపీడీఓ వర్కాల మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఇంటి వద్దనే ఓటింగ్‌ సదుపాయం కల్పించారు. శనివారం ఆయా గ్రామాల్లో మొత్తం 38మంది హోం ఓటింగ్‌ సదుపాయాన్ని వినియోగించుకున్నట్లు వారు తెలిపారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శులు, బూత్‌ లెవల్‌ అధికారులు ఉన్నారు.

**18 మంది ఓటు హక్కు వినియోగం**

అడవిదేవులపల్లి : మండలంలో మొత్తం 21 మంది ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తులు చేసుకోగా శనివారం ఇంటి వికలాంగులు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 14 మంది వికలాంగులు, 4 వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసిస్టెంట్‌ పోలింగ్‌ ఆఫీసర్‌ నగేష్‌ ఆధ్వర్యంలో నేరుగా ఓటరు వద్దకు వెళ్లి ఓటు వేయించారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్లు శోభ, రమా, మనేమ్మ తదితరులున్నారు.

త్రిపురారం : ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు మండలంలోని గ్రామాల్లో ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్ల నుంచి ఓటు వేయించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మిర్యాలగూడ టౌన్‌ : ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తులు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగులు శనివారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలోని దామరచర్ల, వేములపల్లి, మాడుగులపల్లి, మిర్యాలగూడ, అడవిదేవులపల్లి మండలాలల్లో మొత్తం వృద్ధులు, వికలాంగులు 363 మందికి గాను నియోజకవర్గంలో 210 మంది వరకు ఓటును వినియోగించుకున్నట్లు మండల తహసీల్దార్‌ హరిబాబు తెలిపారు.

## అనుమతులు లేకుండా చెరువు మట్టి తరలిస్తే చర్యలు



వివరాలు అడిగి తెలుసుకుంటున్న మైనింగ్‌ ఏడీ జాకబ్‌

మిర్యాలగూడ : అనుమతులు లేకుండా చెరువు మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్‌ ఏడీ జాకబ్‌ అన్నారు. శనివారం పట్టణ శివారులోగల పంది‌ళ్లపల్లి చెరువులో మట్టి తరలింపుపై పరిశీలించి మాట్లాడారు. కొన్ని రోజులుగా కొందరు అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం తెలియడంతో శనివారం పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ చెరువులో ఒక హెక్టార్‌ మాత్రం అనుమతి తీసుకున్నారని, వాటిని ఎంతమేరకు తీశారన్న దానిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు జరిమానాతోపాటు ట్రాక్టర్లను, జేసీబీలను సీజ్‌ చేస్తామన్నారు. ఇప్పటికే దామరచర్ల, తడకమళ్ల, వేములపల్లి మండలాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్న దానిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏజీ బాలు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

మాడుగులపల్లి : కాంగ్రెస్‌ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్‌ మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత రాజకీయాలతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే బీజేపీకి పార్లమెంట్‌ ఎన్నికల్లో ఓటర్లు బుద్ధిచెప్పాలన్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి జైవీర్‌రెడ్డి విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, యువజన విభాగం మండలాధ్యక్షుడు మోహన్‌, కన్నెకల్‌ గ్రామశాఖ అధ్యక్షుడు వెంకట్‌ రెడ్డి, నాయకులు లచ్చయ్య, బంగారు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లయ్య

### ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలి

మిర్యాలగూడ అర్బన్‌ : ఇండియా కూటమి కాంగ్రెస్‌ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు డబ్బికార్‌ మల్లేశ్‌ అన్నారు. శనివారం పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాం వద్ద హమాలీ కార్మికులకు కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే కమ్యూనిస్టు పార్టీలు మద్దతు తెలిపే కాంగ్రెస్‌ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, రామారావు, అంజన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## పెండింగ్‌ ప్రాజెక్టులను పట్టించుకోలేదు



కండువా కప్పి కాంగ్రెస్‌పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్‌

దేవరకొండ : నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పట్టించుకోలేదని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవరకొండ జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్‌, తొమ్మిదో వార్డు కౌన్సిలర్‌, రాష్ట్ర నాయకులు హన్మంతు వెంకటేష్‌గౌడ్‌లతో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్‌ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులైన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌, డిండి లిఫ్ట్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టులను పట్టించుకోక పోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నల్లగొండ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజ్‌ఖాన్‌, జూలూరి ధనలక్ష్మి బాలనారాయణ, జాల నర్సింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, ముక్కమల్ల వెంకటయ్యగౌడ్‌, యూత్‌ కాంగ్రెస్‌ నేషనల్‌ కో–ఆర్డినేటర్‌ తారిక్‌ భగవాన్‌, కొర్ర రాంసింగ్‌, కిన్నెర హరికృష్ణ, వంశీ, రాజు, భరత్‌, ఇలియాస్‌, వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి పెద్దవూర జెడ్పీటీసీ



సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, తదితరులు

నాగార్జునసాగర్‌ : కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మదర్‌డెయిరీ మాజీ చైర్మన్‌ గుత్తాజితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి బీఆర్‌ఎస్‌ పార్టీని వీడి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో శనివారం రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. వీరి వెంట పెద్దవూర మండల వైస్‌ ఎంపీపీ గోనె వివేక్‌రావు, పెద్దవూర మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు గజ్జెల లింగారెడ్డి, సీనియర్‌ నాయకులు మాజీ సర్పంచ్‌ వాసుదేవల సత్యనారాయణరెడ్డి, వల్లపురెడ్డి కూడా చేరారు. అనంతరం జడ్పీటీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్‌ అభ్యర్థిగా కుందూరు రఘువీర్‌రెడ్డిని ప్రకటించగానే నాగార్జునసాగర్‌ లోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సమావేశమై తమ పదవులకు, పార్టీ సభ్యత్వాలకు రాజీనామాలు చేసి రఘువీర్‌రెడ్డికి మద్దతు ప్రకటించినట్లు గుర్తు చేశారు. మాజీమంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌ రెడ్డి ఆధ్వర్యంలో పనిచేయనున్నట్లు పేర్కొన్నారు.

## చెరువు ఆక్రమణలపై ఆర్డీఓకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న కామేపల్లి మత్స్యకార్మిక సంఘం సభ్యులు

మిర్యాలగూడ : వేములపల్లి మండలంలోని కామేపల్లి గ్రామంలోని కోనేరు చెరువు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు ఆ గ్రామ మత్స్యకార్మిక సంఘం సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షుడు నారబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ కోనేరు చెరువులో మట్టిని కొందరు అక్రమార్కులు తొలగించి తమ వ్యవసాయ భూమిలో కలుపుకోని భూమిని ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో మైనింగ్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కుల నుంచి చెరువు భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంగ చిన్ననాగయ్య, భిక్షం, శ్రీనివాస్‌, పి.వెంకన్న, ఎస్‌.వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వెంకటేశ్‌



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మిట్టపల్లి వెంకటేశ్‌, తదితరులు

మిర్యాలగూడ టౌన్‌ : మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటేశ్‌ క్యాంపు కార్యాలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముక్క ప్రదీప్‌ అజయ్‌, నవీన్‌, వరుణ్‌, శ్రీను తదితరులున్నారు.

## కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం



సత్యనారాయణపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

త్రిపురారం : మండలంలోని సత్యనారాయణపురంలో ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్‌ వేసవి శిబిరం శనివారం ఐదో రోజూ కొనసాగింది. ఎంటల సాగులో మట్టి పరీక్షల ద్వారా ఎరువుల వినయోగం చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారి డాక్టర్‌ సుమాళిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు పొలంలో మట్టి సేకరణ, నమూన పరీక్షల వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలైన రాగులతో రాగి లడ్డూ విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మండలంలోని కంపాసాగర్‌ గ్రామ పంచాయతీ పరిధిలోని రంగా ఫుడ్‌ ప్రొడక్ట్‌ ఆగ్రో ప్రాసెసింగ్‌ ఇండస్ట్రీస్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ మీనీ, డాక్టర్‌ రంజిత, డాక్టర్‌ ప్రశాంత్‌ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ గ్రామంలోనూ కాంగ్రెస్‌కు మెజార్టీ తగ్గొద్దు



త్రిపురారం : సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్‌ నాయకులు



నిడమనూరు : మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను

త్రిపురారం : ఎంపీ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా గ్రామాల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మెజార్టీ తగ్గకుండా పెరిగే విధంగా కార్యకర్తలు గ్రామ స్థాయిలో కలిసికట్టుగా పనిచేయాలని మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌ రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ధనావత్‌ భాస్కర్‌ నాయక్‌ అన్నారు. శనివారం మండలంలోని బెజ్జికల్‌, మర్రిగూడెం, చెన్నాయిపాలెం, అల్వాలపాడు, సత్యంపాడు తండా, వస్త్రంతండా, రాజేంద్ర నగర్‌, బొర్రాయి పాలెం గ్రామాల్లో కాంగ్రెస్‌ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బిట్టు రవి కుమార్‌, ఐఎన్‌టీయూసి జిల్లా అధ్యక్షుడు సోమయ్య, మైలారుషెట్టి సైదయ్య, మహిళ అధ్యక్షురాలు పద్మ, యూత్‌ అధ్యక్షుడు పీబీ రవి, అనుముల వెంకట్‌ రెడ్డి, అనుముల నర్సిరెడ్డి, అనంత రెడ్డి, అంబటి రాము, సలికంటి బాలకృష్ణ, వీరయ్య, చిలుముల శ్రీనివాస్‌, బహునూతుల నరేందర్‌, బహునూతుల శ్రీనివాస్‌, సంతోష్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రఘువీర్‌రెడ్డిని గెలిపించాలి**

మిర్యాలగూడ : పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టణ కాంగ్రెస్‌ నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని 39వ వార్డులో నల్లగొండ జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు ఎంఎ.సలీం ఇంటింటి ప్రచారం నిర్వహించి రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో చాంద్‌సుల్తానా, కమాలుద్దీన్‌, రెహమాన్‌ పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి**

నిడమనూరు : నల్లగొండ కాంగ్రెస్‌ లోక్‌ సభ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు సీపీఎం శ్రేణులు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను శనివారం అన్నారు. శనివారం మండల కేంద్రంలో మద్దతు ప్రకటించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, గుర్వయ్య, చంద్రశేఖర్‌, దస్తగిరి పాల్గొన్నారు.